వడి'వరి'గా అందని సాగు నీరు

- ప్రధాన కాలువల్లో పుష్కలంగా నీరు
- చిన్న కాలువలకు నీరు చేరని వైనం
- వర్షాల కోసం ఎదురుచూస్తున్న మోపిదేవి, నాగాయలంక మండలాల రైతులు



నిండుగా ప్రవహిస్తున్న 11వ నంబర్ పంటకాలువ



అడపావారిపాలెంలో నాట్లు పడని పొలాలు

మోపిదేవి/నాగాయలంక: ఖరీఫ్‌లో వరిసాగుకు నీరు అందక మోపిదేవి, నాగాయలంక మండలాల రైతులు అల్లాడుతున్నారు. నారుమడులు, వెదపెట్టిన పొలాల్లో ఎండుతున్న వరి పైరును ఎలా సంరక్షించుకోవాలో తెలియక సతమతమవుతున్నారు. కొన్ని గ్రామాల్లో వరినాట్లు పడక బీడువారిన పొలాలను చూసి కన్నీరుపెడుతున్నారు. మోపిదేవి మండలంలో 9, 10, 11, 12 ప్రధాన కాలువల కింద సుమారు ఐదు వేల ఎకరాల ఆయకట్టులో వరిసాగవుతుంది. మండలంలోని 11/4 కాలువ కింద ఇప్పటికీ 1,300 ఎకరాలలో నాట్లు పడలేదు. 11 నంబరు ప్రధాన కాలువలకు సాగునీరు వచ్చినా 11/4, 11/4ఏ కాలువలకు మాత్రం చేరక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎగువ ప్రాంత రైతులు కొంతమంది కాలువల్లో ఆయిల్ ఇంజిన్లు పెట్టి నీరు తోడి పొలాలు, నారుమడులకు నీటి తడులు అందిస్తుండటంతో దిగువకు చుక్కనీరు చేరడంలేదని రైతులు వాపోతున్నారు. పెదకళ్లేపల్లి శివారు మూలలంక ప్రాంతంలో సుమారు 100 ఎకరాల పైగా పొలాలు బీడుబారాయని, అడపావారిపాలెం, కుమ్మరిపాలెం, కూరేటివారిపాలెం తదితర గ్రామాల్లో 800 ఎకరాలు, అయోధ్య, కోసూరువారిపాలెం తదితర లంకగ్రామాల్లో 400 ఎకరాల్లో నాట్లు వేయలేదని రైతులు తెలిపారు. ఇరిగేషన్‌శాఖ అధికారులు స్పందించి సాగునీరు అందించి సకాలంలో వరినాట్లు పడేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

సాగునీరు అందించండి మహాప్రభో..

నాగాయలంక మండలంలోని పలు దిగువ ప్రాంతాల్లో నారుమళ్లు సిద్ధమైనప్పటికీ సాగునీరు లేక నాట్లు పడలేదు. వెదజల్లిన పొలాలకు నీరు అందక పైరు ఎండిపోతోందని రైతులు వాపోతున్నారు. మండలంలోని తలగడదీవి, గణపేశ్వరం, బర్రంకుల, నాలి తదితర ప్రాంతాల్లో నారుమడులు ఏపుగా పెరిగినా సాగునీరు లేక నాట్లు పడలేదు. కొందరు కూటమి నాయకులు అధికారులను తమ చెప్పు చేతుల్లో పెట్టుకుని సాగునీటి నియంత్రణను తమకు అనుకూలంగా మార్చుకోవడంతో దిగువప్రాంత రైతులకు సాగునీరు అందడంలేదని అవనిగడ్డ నియోజకవర్గ కాపునాడు అధ్యక్షుడు, తలగడదీవి రైతు ప్రతినిధి భోగాది సోమశేఖర్ ఆరోపించారు. బర్రంకుల, నాలి ప్రాంతాల్లో నీరు లేక నారుమళ్లు ఎండిపోతున్నాయి. తలగడదీవి పరిధిలో వెదజల్లిన పొలాలకు నీరు చాలక ఎండుముఖం పడుతున్నాయి. వక్కపట్లవారిపాలెం లాకులకు సమీపంలోనే సాగునారు అందక ఇంజిన్లతో నీటితడులు అందించాల్సి వస్తోందని రైతులు పేర్కొంటున్నారు. సాగునీరు అందక, చేతికందిన నారు నాటేందుకు పనికిరాకుండా పోయిందని తలడదీవి రైతు వర్రే శ్రీమన్నారాయణ, వెదజల్లిన పొలంలో నీరులేక పైరు ఎండుతోందని గణపేశ్వరం గ్రామానికి రైతు పిరాటి అర్జున్ ఆవేదన వ్యక్తం చేశారు.



వక్కపట్లవారిపాలెం లాకుల సమీపంలోనే ఇంజిన్లతో అవస్థలు పడుతున్న రైతుల

వర్షాలే దిక్కు



పెదకళ్లేపల్లి శివారు మూలలంక ప్రాంతంలో 11/4వ నంబర్ కాలువ కింద ఏడు ఎకరాలు సాగు చేస్తున్నా. సాగు నీరు అందకపోవడంతో పొలంలో మట్టిని తవ్వి మరింతగా పల్లం చేసినా సాగు నీరు అందడం లేదు. ప్రకృతి కరుణించి వర్షాలు పడితేనే ఉపయోగం ఉంటుంది. ఇరిగేషన్ అధికారులు స్పందించి సాగునీరు అందించాలని కోరుతున్నా.

– యర్రంశెట్టి వెంకట నారాయణరావు, పెదకళ్లేపల్లి

బీడువారుతున్న పొలాలు



సకాలంలో సాగు నీరు అందకపోవడంతో పంట భూములు బీడు భూములుగా మారిపోతున్నాయి. కొంత మంది రైతులు దుక్కులు దున్ని సాగుకు సిద్ధం చేయగా, కాలువలకు నీరు అందకపోవడం వల్ల నాట్లు వేయలేకపోతున్నాం. ఎప్పటికి నాట్లు పడతాయో కూడా తెలియడంలేదు.

– కూనపరెడ్డి రమేష్, అడపావారిపాలెం

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కృత్తివెన్ను: మండల పరిధిలోని కృత్తివెన్ను, లక్ష్మీపురం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో సాధారణ మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం ఎనిమిది నుంచి 11.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈఈ గోవిందరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కృత్తివెన్ను, లక్ష్మీపురం సబ్‌స్టేషన్ల పరిధిలోని అన్ని గ్రామాల ప్రజలు, ఆక్వా రైతులు ఈ విషయాన్ని గమనించి తమ సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

మాజేరులో..

చల్లపల్లి: మండలంలోని మాజేరు సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం ఆరు నుంచి తొమ్మిది గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ బసవశాస్త్రులు తెలిపారు. సబ్‌స్టేషన్‌కు సంబంధించిన బ్రేకర్ పనులు చేపట్టనున్న నేపథ్యంలో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

బల్లిపర్రు గురుకులంలో స్పాట్ అడ్మిషన్లు

పెడన: మండల పరిధిలోని బల్లిపర్రు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఖాళీగా ఉన్న ఐదో తరగతి, ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరంలో అర్హులైన వారికి స్పాట్ అడ్మిషన్లు జరుగున్నాయని ప్రిన్సిపాల్ ఎస్. రూతమ్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న వారు నేరుగా గురుకుల పాఠశాలను సంప్రదించి అడ్మిషన్లు పొందవచ్చని చెప్పారు. ఇంటర్మీడియెట్‌లో సీఈసీ, ఎంఈసీ గ్రూపులు మాత్రమే ఉన్నాయని, ఇతర వివరాలకు 97045 50068 నంబరు సంప్రదించాలని ఆమె సూచించారు.

సీపీఐ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయండి



చల్లపల్లి: ఈనెల 23 నుంచి 25వ తేదీ వరకు మూడు రోజులపాటు జరిగే సీపీఐ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కేవీవీ ప్రసాద్ కోరారు. స్థానిక చంద్రరాజేశ్వరరావు వికాస కేంద్రంలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మహాసభల్లో దేశంలో, రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న పరిణామాలపై, దేశవ్యాప్తంగా రైతాంగ, కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలపై చర్చ జరుగుతుందన్నారు. రెండు పార్టీలకు భిన్నంగా మూడో ప్రత్యామ్నాయంగా కమ్యూనిస్టు పార్టీలు, ఇతర కలిసొచ్చే పార్టీలతో కలిసి భవిష్యత్ నిర్మాణానికి ఈ మహా సభలు వేదిక కానున్నాయని తెలిపారు. ఈనెల 23వ తేదీన మధ్యాహ్నం స్థానిక ఆర్టీసి బస్టాండు నుంచి ప్రదర్శన ప్రారంభమవుతుందని వేలాదిగా పార్టీ శ్రేణులు పాల్గొని సభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి నార్ల వెంకటేశ్వరరావు, సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్, కార్యవర్గ సభ్యుడు కాట్రగడ్డ రామచంద్ర జ్యోషి తదితరులు పాల్గొన్నారు.

మచిలీపట్నం బస్సు సర్వీసు తాత్కాలికంగా నిలిపివేత

కోడూరు: జిల్లా కేంద్రమైన మచిలీపట్నం నుంచి కోడూరు మండలానికి ఉల్లిపాలెం వారధి మీదుగా నడుపుతున్న ఆర్టీసీ బస్సు సర్వీసును తాత్కాలికంగా నిలిపివేసినట్లు డిపో మేనేజర్ పి.పెద్దిరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మచిలీపట్నం సమీపంలో రోడ్డు కల్వర్టు పనులు చేస్తున్న కారణంగా బస్సు సర్వీసును నిలిపివేసినట్లు చెప్పారు. కల్వర్టు పని పూర్తికాగానే మళ్లీ సర్వీసును పునః ప్రారంభిస్తామని ఆయన తెలిపారు.

ఆటో కార్మికులకు ప్రత్యామ్నాయం చూపాలి



చల్లపల్లి: మహిళలకు ఉచిత బస్సు నేపథ్యంలో ఆటో కార్మికులకు ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలకు కల్పించాలని సీఐటీయూ మండల కార్యదర్శి మహమ్మద్ కరీముల్లా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈనెల 15వ తేదీ నుంచి మహిళల కోసం ఆర్టీసి ఉచిత బస్సు పథకాన్ని ప్రారంభిస్తామని ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో శుక్రవారం స్థానిక కృష్ణాజిల్లా ఆటో వర్కర్స్ యూనియన్ రేపల్లె పాయింట్ వద్ద ఆటో కార్మికులతో కలిసి కరీముల్లా మాట్లాడారు. మహిళలకు ఉచిత బస్సు పథకం వల్ల ఆటో కార్మికులు ఉపాధి కోల్పోతారని అన్నారు. ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని అములు చేయాలని డ్రైవింగ్ లైసెన్స్ ఉన్న ఆటో కార్మికునికి ఆటో మిత్ర పథకం కింద ఏడాదికి రూ. 25వేలు ఇచ్చి ఆదుకోవాలని కోరారు. పెంచిన డీజిల్, పెట్రోల్ ధరలను తగ్గించాలని కోరారు. ఆటో కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 12వ తేదీన కలెక్టర్‌ను కలవనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో స్వతంత్ర ఆటో వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు ముద్రగడ రత్నగిరి, రేపల్లె ఆటో పాయింట్ కోశాధికారి పసుపులేటి శ్రీనివాసరావు, సభ్యులు బూరె సాంసన్, పెదప్రోలు ఉమామహేశ్వరరావు ఇతర సభ్యులు పాల్గొన్నారు.

జోరుగా రాఖీల విక్రయాలు



గూడూరు: అన్నాచెల్లెలు, అక్కాతమ్ముళ్ల అనుబంధానికి ప్రతీకగా భావించే రాఖీ పర్వదినాన్ని పురస్కరించుకుని గూడూరులో రాఖీల విక్రయాలు శుక్రవారం జోరుగా సాగాయి. శనివారం రాఖీ పర్వదినం కావడంతో దుకాణాల్లో రకరకాల రాఖీలు దర్శనమిచ్చాయి. పలు చోట్ల రాఖీల అమ్మకాలకు ప్రత్యేక స్టాల్స్ కూడా వెలిశాయి. మండల కేంద్రమైన గూడూరుతో పాటుగా మల్లవోలు, తరకటూరు తదితర గ్రామాల్లోని దుకాణాల్లో యువతులు రాఖీలు కొనుగోలు చేశారు.

వైభవంగా వీరలంకమ్మ తల్లి సంబరం



కొత్తపల్లి(ఘంటసాల): ఘంటసాల మండలం కొత్తపల్లి గ్రామంలో వేంచేసియున్న శ్రీలక్ష్మీచెన్నకేశవ వీరలంకమ్మ తల్లి సంబరం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ప్రతి ఏటా శ్రావణ మాసంలో శుక్రవారం వరలక్ష్మీ వ్రతం రోజున ఈ సంబరం నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. తెల్లవారుజామున శ్రీకాకుళంలోని కృష్ణానదిలో అమ్మవారికి స్నానం చేయించిన అనంతరం డప్పు వాయిద్యాల నడుమ ప్రత్యేక వాహనంలో ఊరూరా ఊరేగింపుగా అమ్మవారిని కొత్తపల్లి గ్రామం తీసుకొచ్చారు. సుమారు 300 ఏళ్ల నుంచి లక్ష్మీచెన్నకేశవ వీరలంకమ్మ తల్లి సంబరాన్ని గ్రామంలో నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఘంటసాల ఎస్ఐ కె.ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నసమారాధన నిర్వహించారు.

వరమహాలక్ష్మీ నమోస్తుతే..

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రత పూజలు



కోడూరులోని ఓ ఇంటిలో వరలక్ష్మీ అమ్మవారు



అడ్డపర్ర కనకదుర్గమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న అర్చకులు

కృత్తివెన్ను: వరలక్ష్మీ వ్రతాన్ని భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో శుక్రవారం జరుపుకొన్నారు. శ్రావణ శుక్రవారం వేకువజాము నుంచే భక్తులు ఆలయాలకు చేరుకుని అమ్మవారిని దర్శించుకున్నారు. ముఖ్యంగా మహిళలు తమ తమ ఇళ్లల్లో అమ్మవారి ప్రతిమలను ప్రత్యేకంగా అలంకరించి సాంప్రదాయ పిండివంటలతో నైవేద్యం సమర్పించి, ముత్తయిదువలకు తాంబూలాదులను అందజేశారు. గ్రామాల్లో ఎటు చూసినా పండుగ వాతావరణమే కనిపించింది.

గూడూరు: మండల కేంద్రమైన గూడూరులోని మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి వరలక్ష్మీ వ్రతాలు ఆచరించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పెడన: శ్రావణ శుక్రవారం వరలక్ష్మీ వ్రతాన్ని మహిళలు భక్తిశ్రద్ధలతో ఆచరించారు. వేకువజామునే స్నానాలు ఆచరించి పిండివంటలు చేసి లక్ష్మీదేవిని ప్రత్యేకంగా అలంకరించి పూజించారు. అనంతరం దేవాలయాలకు చేరుకుని అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలను, అన్నప్రసాదాలను స్వీకరించారు.

సామూహిక కుంకుమార్చన

కోడూరు: మండలంలోని మహిళలు వరలక్ష్మీ వ్రత పూజలను భక్తిప్రపత్తులతో నిర్వహించారు. ప్రతి ఇంటి వద్ద లక్ష్మీదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కోడూరులోని కల్యాణ వెంకటేశ్వర స్వామివారి ఆలయంలో మహిళలచే సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. విశ్వనాథపల్లి అద్దంకి నాంచారమ్మ అమ్మవారిని వరలక్ష్మీదేవిగా అలంకరించారు. ఉల్లిపాలెం గోదా, రాజ్యలక్ష్మీ సమేత శ్రీమన్నారాయణ స్వామి, లింగారెడ్డిపాలెం బాలాత్రిపుర సుందరీ దేవి, కోడూరు వాసవీ, కనకదుర్గమ్మ, గంగాభవానీ అమ్మవారి ఆలయాల్లో భక్తుల రద్దీ అధికంగా కనిపించింది.

మచిలీపట్నంటౌన్: వరలక్ష్మీ వ్రతాన్ని నగరవాసులు శుక్రవారం భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. వారి వారి గృహాల వద్ద ఏర్పాటుచేసిన అమ్మవారి ప్రతి రూపాలకు పూజలు నిర్వహించి నగరంలో ఉన్న పలు అమ్మవారి ఆలయాలకు వెళ్లి అమ్మవార్లను దర్శించుకుని పూజలు చేశారు. దీంతో నగరంలోని అమ్మవారి ఆలయాలు మహిళా భక్తులతో కిటకిటలాడాయి.

బంటుమిల్లి: స్థానిక శ్రీపద్మావతి, గోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవాలయంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. అమ్మవారిని వరలక్ష్మీ దేవిగా అలంకరించి పూజలు చేశారు. తొలుత పవిత్రోత్సవాల్లో భాగంగా భక్తులు విష్ణు సహస్ర నామ పారాయణ, లలితా సహస్రనామ పారాయణ పఠించారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



మచిలీపట్నంలో వరలక్ష్మీ పూజలో మహిళలు



బంటుమిల్లిలో సామూహిక కుంకుమ పూజ చేస్తున్న మహిళా భక్తులు

వివాద స్థలానికి స్టేటస్‌కో ఇచ్చిన హైకోర్టు

సాక్షి ఎఫెక్ట్



మూడు స్తంభాల సెంటర్‌లో బైపాస్ రోడ్డు మార్జిన్ స్థలం వద్ద ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

మచిలీపట్నంటౌన్: నగరంలోని మూడు స్తంభాల సెంటర్‌లో విజయవాడ బైపాస్ రోడ్డు మార్జిన్‌లో ఉన్న శ్రీవిజయ గణపతి ఆలయం పక్కన గల రోడ్డు మార్జిన్ ఖాళీ స్థలంపై రాష్ట్ర హైకోర్టు స్టేటస్కో ఉత్తర్వులు జారీ చేసింది. ఈ స్థలాన్ని మంత్రి కొల్లు రవీంద్రకు ప్రధాన అనుచరుడిగా ఉన్న ఓ టీడీపీ నాయకుడు మధ్యవర్తిగా ఉండి శ్రీవిజయ గణపతి ఆలయ కమిటీకి విక్రయించేందుకు బేరసారాలు సాగించారు. రోడ్డు మార్జిన్ ప్రభుత్వ స్థలంగా ఉన్న ఈ స్థలాన్ని విక్రయించేందుకు అడ్వాన్స్ కూడా తీసుకున్న నేపథ్యంలో ఈనెల 5వ తేదీ మంగళవారం సాక్షి దినపత్రికలో 'ప్రభుత్వ స్థలానికి పంగనామం' శీర్షికన వార్త ప్రచురితమైంది. దీంతో ఈ స్థలం తనదని గొల్లపూడి అనురాధ అనే మహిళ హైకోర్టును ఆశ్రయించడంతో కోర్టు స్టేటస్కో ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో అనురాధ ఈ స్థలానికి సంబంధించి హైకోర్టులో కేసు ఉందని దీనిని అతిక్రమించిన వారు శిక్షార్హులని ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. అలాగే ఈ ఉత్తర్వులు నగరపాలక సంస్థ కమిషనర్‌కు అందడంతో ఆయన కూడా ఈ స్థలం వద్ద హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. కాగా స్టేటస్కో ఉండగా ఈ స్థలంలో తవ్వకాలు జరిపిన వ్యక్తిపై ఈ నెల 11వ తేదీన హైకోర్టులో కేసు వేస్తున్నట్లు కమిషనర్ సీహెచ్‌వీవీఎస్ బాపిరాజు తెలిపారు.

అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణలు



గాజుల అలంకరణలో శ్రీలక్ష్మీనాంచారమ్మ



నిమ్మకాయల అలంకారంలో కనకదుర్గమ్మ

చల్లపల్లి: శ్రావణ శుక్రవారం సందర్భంగా మండల పరిధిలోని లక్ష్మీపురంలో వేంచేసియున్న శ్రీలక్ష్మీ నాంచారమ్మ ఆలయంలో అమ్మవారికి గాజులతో ప్రత్యేక అలంకరణ చేశారు. అర్చకులు స్వర్ణశిక సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. చల్లపల్లి పడమర వీధిలోని శ్రీరామలింగ చౌడేశ్వరీ అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

కోడూరు: శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకొని కోడూరు కనకదుర్గమ్మ అమ్మవారికి నిమ్మకాయలతో ప్రత్యేక అలంకారం చేశారు. ఉదయం అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం మహిళలచే సామూహిక కుంకుమార్చనను జరిగింది. పెద్దసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

టీడీపీలో భగ్గుమన్న విభేదాలు

- కొక్కిలిగడ్డ పీఏసీఎస్ ఎన్నికపై జెడ్పీటీసీ మెడబలిమి తీవ్ర ఆగ్రహం
- నియోజకవర్గ పరిశీలకుడు కనపర్తిపై తీవ్రస్థాయిలో మండిపాటు
- మోపిదేవిలో రెండు వర్గాలుగా చీలిక



టీడీపీ నియోజకవర్గ పరిశీలకుడు కనపర్తిపై మండిపడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు మెడబలిమి



జెడ్పీటీసీ సభ్యుడి వ్యాఖ్యలను ఖండిస్తున్న మోపిదేవి మండల టీడీపీ నాయకులు

అవనిగడ్డ: పీఏసీఎస్ సొసైటీ ఎన్నికలు టీడీపీలో చిచ్చుపెట్టాయి. మోపిదేవి మండలం కొక్కిలిగడ్డ పీఏసీఎస్ సొసైటీ అధ్యక్ష ఎన్నిక వల్ల టీడీపీలో వర్గ విభేదాలు మరోసారి బయటపడ్డాయి. తను సూచించిన వ్యక్తికి కాకుండా వేరొకరికి అధ్యక్ష పదవి ఇవ్వడం పట్ల జెడ్పీటీసీ సభ్యుడు మెడబలిమి మల్లికార్జునరావు నియోజకవర్గ పరిశీలకుడు కనపర్తి శ్రీనివాసరావుపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. సీనియర్ నాయకుడిని అయిన తనకు విలువ ఇవ్వకుండా ఎక్కడి నుంచో వచ్చిన నాయకుడి పెత్తనం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ వివాదంతో టీడీపీ నాయకులు రెండు వర్గాలుగా చీలినట్టయింది.

రాజీనామాకు సిద్ధపడ్డ మెడబలిమి..!

టీడీపీ సీనియర్ నాయకుడు, మోపిదేవి జెడ్పీటీసీ సభ్యుడు మెడబలిమి మల్లికార్జునరావు గురువారం రాత్రి తన ఇంటి వద్ద నియోజకవర్గంలోని కొంత మంది టీడీపీ నాయకులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. పార్టీకి రాజీనామా చేసేందుకు సిద్ధమవ్వగా కొంతమంది నాయకులు టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొనకళ్ల నారాయణ, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావుతో ఫోన్‌లో మాట్లాడించి బుజ్జగించారు. పార్టీకి నష్టం చేకూర్చేలా వ్యవహరిస్తున్న కొంతమంది సన్నాసులను దూరంగా పెట్టాలని మెడబలిమి చేసిన వ్యాఖ్యలు టీడీపీలో తీవ్ర దుమారాన్ని రేపాయి.

మెడబలిమి వ్యాఖ్యలను ఖండించిన ఒక వర్గం నేతలు

మోపిదేవి జెడ్పీటీసీ సభ్యుడు మెడబలిమి మల్లికార్జునరావు నియోజకవర్గ పరిశీలకుడు కనపర్తి శ్రీనివాసరావుపై చేసిన అనుచిత వ్యాఖ్యలను శుక్రవారం అవనిగడ్డ, మోపిదేవి మండలాల్లో కొంత మంది టీడీపీ నాయకులు తీవ్రంగా ఖండించారు. దీంతో ఈ వివాదం టీడీపీలో రెండు వర్గాలుగా చీలిక తెచ్చింది. కనపర్తిని సమర్థించేవారు ఒక వర్గంగా మెడబలిమిని బలపరిచేవారు మరో వర్గంగా విడిపోయారు. ఇప్పటికే అవనిగడ్డ, నాగాయలంక మండలాల్లో టీడీపీ రెండు వర్గాలుగా విడిపోగా తాజా వివాదం మోపిదేవి మండలంలోనూ రెండు వర్గాలుగా విడిపోయేలా చేసింది. రానున్న రోజుల్లో ఈ వర్గ పోరు ఇంకెన్ని మండలాలకు విస్తరిస్తుందో చూడాలి.

కబడ్డీ పోటీల్లో విద్యార్థినుల ప్రతిభ

పమిడిముక్కల: తాడంకి హైస్కూల్ విద్యార్థులు జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో ప్రతిభ చాటారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ జిల్లా స్థాయి కబడ్డీ అండర్-22 విభాగంలో బాలుర, బాలికల ఎంపికలు ఇటీవల అవనిగడ్డ హైస్కూల్లో నిర్వహించారు. బాలికల విభాగంలో కంభపు బుజ్జి, సరగడ జ్యోష్ణవి, బోయి వెంకటలక్ష్మి, పిండింట్ల పల్లవి, సాడి దీపిక ఎంపికయ్యారని హెచ్‌ఎం. ప్రసాద్ తెలిపారు. ఈ నెల 11వ తేదీన గుంటూరులో జరిగే జోనల్ స్థాయి పోటీల్లో జిల్లా తరఫున పాల్గొంటారని పేర్కొన్నారు. హైస్కూల్‌లో శుక్రవారం శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు పి.రవీంద్రబాబును, ఎంపికైన విద్యార్థినులను హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుందాం

సీపీఎం జిల్లా కార్యదర్శి నరసింహారావు



మచిలీపట్నంటౌన్: కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న ఓటర్ల జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)ను వ్యతిరేకించి ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వై. నరసింహారావు పిలుపునిచ్చారు. స్థానిక నవకళ సెంటర్‌లో ఎస్ఐఆర్‌కు వ్యతిరేకంగా సీపీఎం మచిలీపట్నం నగర కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ల జాబితాలు తప్పుల తడకగా ఉన్నాయని, ఎన్నికల కమిషన్ కేంద్ర ప్రభుత్వం చేతిలో కీలుబొమ్మగా మారిపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రం తాజాగా ఎస్ఐఆర్ పేరుతో ఓటర్ల హక్కును హరిస్తోందన్నారు. ప్రజలు, ప్రజాస్వామ్య సంఘాలు కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. సీపీఎం సీనియర్ నాయకుడు కొడాలి శర్మ, సీపీఎం నగర కార్యదర్శి బూర సుబ్రహ్మణ్యం, సీఐటీయూ మచిలీపట్నం కన్వీనర్ జయరావు, గీత కార్మిక సంఘం రాష్ట్ర నాయకుడు వాకా రామచంద్రరావు, జిల్లా బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకుడు కేవీ గోపాలరావు, మచిలీపట్నం మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి శీరంశెట్టి దుర్గా ప్రసన్నుడు, బీఎస్ఎన్ఎల్ విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకుడు ఎండీ యునస్, కేవీపీఎస్ నగర అధ్యక్షుడు ఎంఏ బెనర్జి, ఎ. ధర్మపూరి, ఈడే రామారావు పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన నోటీసు

కృష్ణా జిల్లా, గూడూరు మండలం, గూడూరు గ్రామము/పట్టణం, ఇంటి నెం. 8-45/B నందు నివసించుచున్న శ్రీ / శ్రీమతి చలవాది నటరాజు, తండ్రి/భర్త ముత్తిలింగం అనువారు Missing వలన ది. 20-01-2015 తేదిన Missing వీరు సిటీకేబుల్ ఆపరేటర్‌గా పనిచేసేడివారిని, చనిపోయిన వీరికి ఈ క్రింది పేర్కొనిన వారి కుటుంబ సభ్యులై ఉన్నారని దరఖాస్తు చేసియున్నారు.

వ. నెం.	పేరు	తండ్రి / భర్త పేరు	వయస్సు	మరణించిన వారితో బంధుత్వము
1.	చలవాది జయలక్ష్మి	నటరాజు	52 Y.	భార్య
2.	చలవాది మృదుల		33 Y.	కుమార్తె
3.	చలవాది వాసవదత్త	నటరాజు	31 Y.	కుమారుడు

పైన తెలిపిన వారు మాత్రమే వారసులై వున్నారని పేర్కొనినారు. వీరికి రావలసిన బ్యాంకు లావాదేవీ వగైరాలు పొందు నిమిత్తం కుటుంబ సభ్యుల ధృవపత్రము అవసరమై దరఖాస్తు చేసుకొనియున్నారు. ఇట్టి విషయమై ఇంకనూ ఎవరికైనా అభ్యంతరాలు ఉన్నయెడల శ్రీ తహసీల్దారు, గూడూరు వారికి నోటీసు ప్రచురించిన తదుపరి 15 రోజులలోగా తమ యొక్క ఆక్షేపణలు / అభ్యంతరములు తెలియపరచవలసినదిగా కోరడమైనది. ఈ విషయమై ఏవిధమైన అభ్యంతరములు రానియెడల పై వారిని కుటుంబ సభ్యులుగా గుర్తించి, వారు తప్ప ఎవరూ కుటుంబ సభ్యులు లేరని భావించి పైవారికి కుటుంబ సభ్యుల ధృవపత్రము మంజూరు చేయబడుటకు తగు చర్య తీసుకొనబడును.

డి. రాజ్యలక్ష్మి, తహసీల్దార్, గూడూరు